విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

వనస్థలిపురం: నాటకరంగ దర్శక, నటుడు ఆండ్ర సాంబమూర్తి జయంతి సందర్భంగా వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం వనస్థలిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వాగ్దేవి పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విజ్ఞానాత్మకమైన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా రంగస్థల కళాకారులకు వారికి ఉపయోగపడే రెండు టేబుళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వేదభూమి ప్రతినిధి సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, పంపన వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్గొండ సభకు తరలిన బీఆర్‌ఎస్ నేతలు


మన్సూరాబాద్ నుంచి సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ నల్గొండలో మంగళవారం నిర్వహించిన చలో నల్గొండ సభకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డితో పలు డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట వెళ్లారు.

ఆర్‌కేపురం డివిజన్ నుంచి...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ నుంచి మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చలో నల్గొండ సభకు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాజిద్, డివిజన్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ తదితరులు ఉన్నారు.


ఆర్‌కేపురం నుంచి సభకు వెళ్తున్న అరవింద్ శర్మ తదితరులు

మద్యం మత్తులో గొడవ.. ఒకరికి తీవ్రగాయాలు


దాడిలో గాయపడ్డ శ్రీనివాస్

చైతన్యపురి: మద్యం మత్తులో ఉన్న ఇద్దరి స్నేహితుల మధ్య చిన్న గొడవ జరిగింది.. ఇద్దరిలో ఒకరు స్నేహితుడిపై మద్యం సీసాతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. జరిగింది. ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్‌లో ఉండే శ్రీనివాస్, జమీల్ ఇద్దరూ స్నేహితులు. సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగి దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ థియేటర్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న జమీల్ తన వద్ద ఉన్న మద్యం సీసా పగులగొట్టి శ్రీనివాస్‌పై దాడి చేయగా మెడ, ఇతర శరీర భాగాల్లో గాయాలయ్యాయి. అతడి నుంచి తప్పించుకుని పరుగు పెట్టిన బాధితుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో మలక్‌పేట చర్మాస్ సమీపంలో కింద పడిపోయాడు. గమనించిన కొందరు చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సరూర్‌నగర్ పరిధిలో ఘటన జరగటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జమీల్ కోసం గాలిస్తున్నారు.

'విషవాయువులు'పై అటవీశాఖ డైరెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మన్సూరాబాద్: 'వామ్మో విషవాయువులు' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనానికి అటవీ శాఖ ఉన్నతాధికారి స్పందించారు. ఆటోనగర్ అటవీ ప్రాంతంలో కొందరు రసాయన వ్యర్థాలు, జంతు కళేబరాలు డంపింగ్ చేయడంతో సమీప కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో కాలనీల వాసులతో పాటు ధాత్రి సంస్థ ప్రతినిధులను అటవీ శాఖ డైరెక్టర్ తరుణ్ కత్తుల అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

డ్రైవర్లకు సీపీఆర్‌పై అవగాహన అవసరం

నాగోలు: డ్రైవర్లు అందరూ కార్డియో పల్మనరీ రీసస్టేషన్ (సీపీఆర్)పై అవగాహన కలిగి ఉండాలని నాగోలు ఆర్టీఓ జి.సురేశ్‌రెడ్డి అన్నారు. నాగోలు ఆర్టీఓ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం వాహన డ్రైవర్లకు, దరఖాస్తుదారులకు రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రథమ చికిత్స, సీపీఆర్ నేర్చుకుంటే అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందని అన్నారు. మనిషి ఆక్సిజన్ తీసుకోలేనప్పుడు గుండె ఆక్సిజన్ పంపింగ్ ఆగిపోతున్న సమయంలో ప్రథమ చికిత్స ఉపయోగపడుతుందని తెలిపారు. సరైన వైద్యం అందడం లేదా అంబులెన్స్ వచ్చే లోపల ప్రథమ చికిత్సపై అవగాహన ఉన్నవారు ఈ ప్రక్రియ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ నర్సింగ్‌రావు, ఆర్టీఓ అధికారులు శ్రీనివాస్, రాజు, జీఆర్ రాజు, రవీందర్‌రెడ్డి, స్వప్న, రఘుకుమార్, మానస, అనిత, సత్యనారాయణ, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'చైతన్య' విద్యార్థుల ప్రతిభ

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ చైతన్య డే స్కాలర్ కాలేజీ విద్యార్థులు మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటుకున్నారు. వారిని కళాశాల ఉపాధ్యాయులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ఆదిరెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో ప్రతిభ కనబర్చడం సంతోషకరంగా ఉందన్నారు. మెయిన్స్‌లో 13 మంది 99 శాతం, 30 మంది 98 శాతం, 200 మంది 90 శాతం పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుమల్‌రావు, రవి ప్రకాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సంజీవరెడ్డి, రూపాదేవి, రాధిక, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తరలింపుపై నిర్లక్ష్యం

- రోడ్ల పక్కన మట్టికుప్పలు, భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్లకొమ్మలు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని పారిశుద్ధ్య సిబ్బంది
- అవస్థలు పడుతున్న స్థానికులు


చైతన్యపురి కాలనీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలు

చైతన్యపురి: కాలనీల్లో రోడ్ల పక్కన మట్టి కుప్పలు, నిర్మాణ వ్యర్థాలు, కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు, ఆకులు తరలింపునకు నోచుకోకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లను నిత్యం శుభ్రం చేయడంతో పాటు రోడ్ల పక్కన ఉండే చెట్లకొమ్మలు వంటివి ఎప్పటికప్పుడు తరలించాల్సిన పారిశుద్ధ్య విభాగం సిబ్బంది నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదు.

- చైతన్యపురి డివిజన్ చైతన్యపురి కాలనీ, వికాస్‌నగర్, సాయినగర్ ప్రాంతాల్లోని పరిస్థితే ఇందుకు నిదర్శనం.
- వికాస్‌నగర్, చైతన్యపురి కాలనీ రహదారిలో రోడ్డు పక్కనే బిల్డింగ్ వ్యర్థాలు కుప్పలుగా పోసి నెల రోజులకు పైగా అవుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది వాటిని తరలించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- చెట్లకొమ్మల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని, చెత్తకుళ్లిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. బిల్డింగ్ వ్యర్థాల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయని వాహనదారులు చెప్తున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు బిల్డింగ్ వ్యర్థాలను రహదారుల పక్కన డంపింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు రోడ్లపై ఉన్న చెట్లకొమ్మలు, మట్టి కుప్పలను పారిశుద్ధ సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చైతన్యపురి కాలనీలో రహదారిపై పడి ఉన్న చెట్ల ఆకులు


చైతన్యపురి వార్డు ఆఫీస్ రోడ్డు పక్కన డంప్ చేసిన బిల్డింగ్ వ్యర్థాలు

చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయండి


సరూర్‌నగర్ చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

- అధికారులకు హెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశం
- లింగోజిగూడ డివిజన్‌లో పర్యటించిన రొనాల్డ్ రాస్

లింగోజిగూడ: జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ మంగళవారం లింగోజిగూడ డివిజన్‌లో పర్యటించారు. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పలువురు అధికారులతో కలిసి ఆయన గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ, సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో తాను లింగోజిగూడ డివిజన్‌లోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్యలను నేరుగా పరిశీలించాలని కోరడంతో ఆయన డివిజన్ పర్యటనకు వచ్చారని చెప్పారు గ్రీన్ పార్క్ కాలనీలో ఎఫ్‌టీఎల్ పరిధిలో లేని సర్వే నంబర్లలోని ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు, నిర్మాణ అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే, పారిశ్రామిక ప్రాంతాల కింద ఉన్న కాలనీల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ పనులను పూర్తి చేయడంతో పాటు పూడికతీత, గుర్రం డెక్క పనులను వేగవంతం చేయాలని కోరారు. సరూర్‌నగర్ చెరువు రెండు జోన్ల కింద ఉందని, దానిని ఒకే ఎల్‌బీనగర్ జోన్ కిందకు తీసుకురావాలని కోరారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ, ఎఫ్‌టీఎల్ పరిలో లేని గ్రీన్ పార్క్ కాలనీకి అనుమతులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామిక ప్రాంతాల సమస్యలు కోర్టులో ఉందని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయడంతో పాటు గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువును ఒకే జోన్ కిందకు తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు అశోక్‌రెడ్డి, కోటేశ్వర రావు, డీసీలు దశరథ, అరుణకుమారి, ఇరిగేషన్ అధికారి పవన్, సిటీ ప్లానర్ ప్రసాద్, డీఈ కార్తీక్, శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ విజయ్‌కుమార్, ఎంటామాలజీ ఎస్‌ఈ రజినీ, ఏఈ మణెమ్మ, నాయకులు బాల్‌రెడ్డి, జగన్ రెడ్డి, శ్రావణ్‌గుప్తా, జూపల్లి ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, నరేందర్, రోహిత్‌రెడ్డి, నరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమిస్తున్నానని బాలిక వెంటపడి, ఫేక్ వీడియోలతో బెదిరించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ సునీత బర్ల తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామానికి చెందిన బాలిక (17)ఇబ్రహీంపట్నంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకొనేది. ముకునూరు గ్రామానికే చెందిన శివ (20) సదరు విద్యార్థి కాలేజీకి వెళ్లి వచ్చే క్రమంలో వెంటపడి ప్రేమిస్తున్నానని వేధించేవాడు. బాలిక నిరాకరించడంతో మార్ఫింగ్ చేసిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని, ఆమె తల్లిదండ్రుల అంతుచూస్తానని బెదిరించేవాడు. శివ వేధింపులు తాళలేక బాధితురాలు 2018 ఏప్రిల్ 4న ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు మంగళవారం నిందితుడు శివకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

భయపడకుండా పరీక్షలు రాస్తే విజయం తథ్యం


10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న మోటివేషన్ ట్రైనర్ వేణుగోపాల్

నాగోలు: మార్చిలో 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యం చేరుకొనేందుకు ఎలాంటి ఆందోళన పెట్టుకోకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని మోటివేషన్ ట్రైనర్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు శక్తి ఉన్నంత వరకు మీ లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం కృషి చేయాలని కోరారు. లక్ష్య సాధనకు అనువైన మార్గాన్ని శోధించాలని,అప్పుడే విజయం సాధ్యమవుతుందని తెలిపారు.ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ, లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలను సాదరంగా ఆహ్వానించాలని, భయపడకుండా శక్తి మేర ప్రయత్నిస్తే విజయం సిద్ధిస్తుందన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉన్నంత స్థాయి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం గర్వించే గొప్ప నాయకుడు పీవీ

నాగోలు: మాజీ ప్రధాని, తెలుగు తేజం పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం రావడంపై శోభన్ బాబు సేవా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ శేషేంధర్ రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం అల్కాపురి చౌరస్తాలో ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. పీవీకి భారతరత్న ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోశోభన్‌బాబు సేవా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శంకర్ రావు, ఉపాధ్యక్షులు బొట్టు మురళి, జగదీష్, కన్వీనర్ల యాదగిరి, మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అల్కాపురిలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శోభన్‌బాబు సేవా సమితి నాయకులు

బాబా ఆలయంలో నేడు వసంత పంచమి వేడుకలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ గుండమల్లయ్య తెలిపారు. సరస్వతి మాత పుట్టిన రోజు సందర్భంగా బాబా సన్నిధిలో విద్యార్థులచే శ్రీసరస్వతి మాత పూజ జరిపిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ కోరారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, టమోటా (618 రకం) 19 , వంకాయ 14, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 23. దొండ 45, ఆలు 23, ఉల్లి 20, గోకర 45, దోస 19, సొర 9, పొట్ల 13, అరటి 11, చిక్కుడు 45, అర్వి 55, మునగ 55, చిలగడదుంప 60, బీట్‌రూట్ 25, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 55. బుధవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

డ్రైనేజీ, రోడ్డు సమస్యలు పరిష్కరించండి


నేతాజీనగర్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్

చైతన్యపురి: కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, రహదారుల సమస్యలను పరిష్కరించాలని గడ్డిఅన్నారం డివిజన్ నేతాజీనగర్ కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి మంగళవారం కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని కొంత ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేదని, రహదారులు గుంతలు పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, చెట్ల కొమ్మలు కొట్టి వాటిని అలాగే రహదారులపైనే వదిలేస్తున్నారని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మూర్తియాదవ్, కాలనీవాసులు చందర్, ప్రభాకర్, నర్సింగరావు, ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్‌తోనే నీటి కాలుష్యం


మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని హరిజన బస్తీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ శిథిలావస్థకు చేరటంతోనే నల్లాల నుంచి కలుషిత తాగునీటి సరఫరా అవుతోందని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. హరిజన బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతున్న విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం జలమండలి అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. కలుషిత నీటి సరఫరాను ప్రత్యక్షంగా పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన మ్యాన్‌హోల్ మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట కాలం చెల్లిన తాగునీటి పైప్ స్థానంలో కొత్త పైప్ వేయాలని అధికారులను కోరారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి కటకోని కుంటలో రూ.20 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, జలమండలి డీజీఎం సరిత, సిబ్బంది రాములు, నాయకులు పాశం శ్రీశైలం, అవినాష్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, రమేష్, రాజేష్, అంజి, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దిల్‌శుక్‌నగర్ నారాయణ డే డివిజన్ విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఫలితాల్లో షరీఫ్ ఫరాజ్ 99.95 పర్సంటైల్‌తో మొదటి ర్యాంకు సాధించగా, 99.94 పర్సంటైల్‌తో చిలుకుర్తి భువన్ రెండో ర్యాంక్ దక్కించుకున్నాడు. ఇదు క్యాంపస్‌కు చెందిన 32 మంది విద్యార్థులు 99 శాతం పైగా సాధించడం విశేషం . ఈ విజయాలను సాధించడానికి కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులను కోడీన్ రాధాక్రిష్ణ, డీజీఎం రాజు, డీన్ అమరేందర్, ప్రిన్సిపాల్స్ జగదీశ్, రవికుమార్, రమేశ్, శేషు కుమార్, చంద్రభువన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కళ్యాణి, భూపాల్ రెడ్డి, ఏజీఎం గోవర్ధన్ అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు.

నాగోలు సీఐకి సత్కారం

నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన పరుశురాంను మంగళవారం జైపురికాలనీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్, శివ, సతీష్, చరణ్, అరుణ్, భాను, సాయి, శివ పాల్గొన్నారు.


సీఐ పరుశురాంను సన్మానిస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ సభ్యులు